ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేలా జాగ్రత్తలు చేపట్టాలి

- అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్

నవతెలంగాణ-బోధన్



సిబ్బందికి సూచనలు చేస్తున్న అడిషనల్ కలెక్టర్

పార్లమెంట్ ఎన్నికలు పకడ్బందీగా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా నిర్వహించేలా జాగ్రత్తలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. గురువారం ఆయన సాలూర మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బిఎల్ఓలకు, స్థానిక గ్రామపంచాయతీ సిబ్బందికి, రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన బోధన్ పట్టణంలోని విజయమేరీ పాఠశాలలో ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమును పరిశీలించారు. ఆయనవెంట బోధన్ తహసీల్దార్ గంగాధర్, ఆర్ఐ గంగాధర్ తదితరులున్నారు.

లైబ్రరీకి వాటర్ కూలర్‌ను వితరణ చేసిన సంఘ సేవకురాలు సరోజనమ్మ

నవతెలంగాణ-బోధన్



బోధన్ పట్టణంలోని గ్రంథాలయంలో పాఠకుల సౌకర్యార్థం ప్రముఖ సంఘ సేవకురాలు సరోజనమ్మ వాటర్ కూలర్‌ను గురువారం అందించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. సరోజనమ్మ సేవలు మరువలేనివని అన్నారు. ఈ సందర్భంగా ఆమెను బోధన్ గ్రంథాలయంలో ఘనంగా సన్మానించారు. సమాజంలో ఆమె చేస్తున్న సేవలు వెలకట్టలేనివని తెలిపారు. ఉపాధ్యాయురాలిగా విద్యాబుద్ధులు నేర్పించిన ఆమె సమాజ హితం కోసం పాటుపడుతున్నారని అన్నారు. జీవిత పరమార్థాన్ని సార్థకం చేసుకోవడానికి ఆమె సమాజ హితాన్ని కోరుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో మదన్‌మోహన్, అడ్డంకి ఉషన్, అంకు దాము, న్యాయవాది దత్తాత్రి, గ్రంథ పాలకుడు సందీప్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- పోలింగ్‌కు 72 గంటలు, 48 గంటల ముందు అత్యంత కీలకమైన నిశ్శబ్ద కాలం
- జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. పోలింగ్‌కు 72 గంటలు, 48 గంటల ముందు అత్యంత కీలకమైన నిశ్శబ్ద కాలంలో చేపట్టవలసిన కార్యక్రమాలపై అధికారులకు దిశానిర్దేశం చేశామని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఎన్నికల పరిశీలకులకు తెలిపారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి గురువారం సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి ఎన్నికల సాధారణ పరిశీలకులు గోపాల్ జి తివారి, ఎన్నికల వ్యయ పరిశీలకులు మోతిలాల్ షెటే, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిశ్శబ్ద కాలంలో పాటించవలసిన నిబంధనలు వివరిస్తూ మూడు రోజులు అత్యంత కీలకమని సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, ఆబ్కారీ, వాణిజ్య పన్నులు, ఆదాయ పన్ను అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వేలెన్స్ బృందాలు, పోలీసులు, వ్యయ నియంత్రణ అధికారులు అప్రమతంగా ఉండాలని అన్నారు. ఎన్నికలు శాంతియుత వాతావరణంలో పారదర్శకంగా జరిగే విధంగా సంబంధిత విభాగాల అధికారులు, ఇంటిలిజెన్స్ బృందాలు గట్టి నిఘా కొనసాగిస్తూ అంకితభావంతో పనిచేయాలని కోరారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్‌లో సభలు, సమావేశాలు నిర్వహించవద్దని తెలిపారు. జిల్లాయేతర వ్యక్తులు ఎవరూ ఉండవద్దని, కళ్యాణ మండపాలు, హెూటళ్లు, లాడ్జింగులు తనిఖీ చేయాలని, అంతర్ రాష్ట్ర, జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద డబ్బు, మద్యం, బహుమతుల రవాణాపై గట్టి నిఘా పెట్టాలని అన్నారు. పోలింగ్ రోజు, పోలింగ్‌కు ముందు రోజు రాజకీయ ప్రకటనలకు సంబంధించి ఎంసిఎంసి నుంచి ముందస్తు అనుమతి పొందేలా చూడాలన్నారు. జిల్లా ఎస్పీ సింధు శర్మతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా అన్ని పోలింగ్ కేంద్రాలలో విద్యుత్, ఫర్నీచర్, మంచినీరు, షామియానా, వీల్‌చైర్, ఫస్ట్ ఎయిడ్ వంటి కనీస మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈవీఎంల కమిషనింగ్ పూర్తయిందని, సెక్టోరల్ అధికారులకు శిక్షణ ఇచ్చామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్, 11న పోలింగ్ సిబ్బంది 3వ విడత ర్యాండమైజేషన్ చేస్తున్నామని తెలిపారు. సిబ్బందిని, ఈవీఎంలను తరలించుటకు అవసరమైన వాహనాలు సమకూర్చుకున్నామని, ఓటర్ స్లిప్పులు పంపిణీ చేశామని తెలిపారు. నిశ్శబ్ద కాలంలో సభలు, సమావేశాలు జరగకుండా, ఓటర్లను డబ్బు, మద్యం, బహుమతులతో ప్రలోభ పెట్టకుండా అంతర్ రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి బృందాల ద్వారా గట్టి నిఘాకు చర్యలు తీసుకున్నామని, ఎన్నికలు ముగిసే వరకు 144 సెక్షన్ అమలు చేయనున్నామని తెలిపారు. మద్యం నిలువల విస్తృత దాడులకు ఆబ్కారీ శాఖకు తగు ఆదేశాలిచ్చామని తెలిపారు. పోలింగ్ తేదీ, సమయం గంట పెంపుపై స్వీప్ ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల ప్రకటనలకు సంబంధించి ఎంసిఎంసి ద్వారా అనుమతులకు కమిటీని అప్రమత్తం చేశామన్నారు. ఎస్పీ సింధు శర్మ మాట్లాడుతూ.. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా పెట్టాలని, ఇప్పటి వరకు 196 కేసులు నమోదు చేశామని తెలిపారు. సమావేశంలో నోడల్ అధికారి వరదారెడ్డి, కలెక్టరేట్ ఏ.ఓ.మసూర్ అహ్మద్, ఎలక్షన్ విభాగం పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

లోన్ రికవరీలో ద్వితీయ బహుమతి అందుకున్న

లింగంపేట్ ఎన్‌డీసీసీబీ మేనేజర్

నవతెలంగాణ-లింగంపేట్



బహుమతిని అందుకుంటున్న ఎన్డీసీసీబీ లింగంపేట్ బ్రాంచ్ మేనేజర్

ఉమ్మడి నిజామాబాద్ కామారెడ్డి జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ లోన్ రికవరీలో లింగంపేట్ ఎన్డీసీసీబీ బ్రాంచ్ రికవరీ ఛాంపియన్ ద్వితీయ బహుమతి అందుకున్నట్లు ఎన్డీసీసీబీ లింగంపేట్ బ్రాంచ్ మేనేజర్ కుమారస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నిజామాబాద్ కామారెడ్డి జిల్లాలో ఎన్డీసీసీబీ లోన్ రికవరీలలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ ఉమ్మడి జిల్లాలలో అత్యధికంగా మూడు కోట్ల 90లక్షల రూపాయల రికవరీతో నిజామాబాద్ కామారెడ్డి జిల్లాలో రెండో స్థానంలో నిలవడంతో.. డిసిసిబి చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి, ముఖ్య కార్యనిర్వాహణాధికారి నాగభూషణం చేతుల మీదుగా రికవరీ ఛాంపియన్ ద్వితీయ బహుమతిని అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా లోన్ రికవరీలో సహకరించిన జిఎం సూర్యప్రకాష్, డీజీఎం శ్రీనివాస్, ఈజిఎంలు నాగరాజు, యాదగిరి, బ్యాంక్ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రచార కార్యక్రమాలు నిషేధం

- పోలింగ్ సందర్భంగా..
- రిటర్నింగ్ అధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పురస్కరించుకుని ఎలక్షన్ కమిషన్ నియమావళిని అనుసరిస్తూ నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలోని బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈ నెల 11 సాయంత్రం 6 గంటల నుంచి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులోకి వస్తుందని, ఎన్నికలు ముగిసే వరకు జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని రిటర్నింగ్ అధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో జిల్లాయేతర వ్యక్తులు ఎవరు కూడా జిల్లాలో ఉండకూడదని స్పష్టం చేశారు. ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, ఎంసిసి, పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, కళ్యాణ మండపాలు, హెూటళ్లు, లాడ్జింగ్‌లు తనిఖీ చేయాల్సిందిగా కలెక్టర్ సూచించారు. కాగా, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సెక్షన్ 126(1)(బి) ఆర్‌పి యాక్ట్ 1951 ప్రకారం ఒపీనియన్ పోల్, ఎగ్జిట్ పోల్స్ నిషేధమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ నెల 11 సాయంత్రం 6.00 గంటల నుంచి ఎన్నికలు ముగిసే వరకు జిల్లాలో మద్యం షాపులను మూసివేయాలని ఆదేశించారు.

ఎంసీఎంసీ అనుమతి లేకుండా ఎన్నికల ప్రచార ప్రకటనలు ప్రచురించొద్దు..

ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) అనుమతి లేకుండా పోలింగ్ రోజున, అలాగే పోలింగ్‌కు ఒక రోజు ముందు అనగా ఈ నెల 12, 13వ తేదీలలో ప్రింట్ మీడియాలో ఎలాంటి ఎన్నికల ప్రచార ప్రకటనలను ప్రచురించకూడదని నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రాజకీయ పక్షాలు, అభ్యర్థులు, ఇతరులు ఎవరైనా సరే ముందస్తుగా ఎంసీఎంసీ ద్వారా అనుమతి కోసం దరఖాస్తు చేసుకుని ధ్రువీకరణ పొందాలని సూచించారు. లేనిపక్షంలో ఎన్నికల కమిషన్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం తనకున్న అధికారాలను వినియోగిస్తూ తగుచర్యలు చేపట్టేందుకు అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ నెల 12, 13 తేదీలలో ప్రింట్ మీడియాలో (ఆయా పత్రికలలో) ఎన్నికల ప్రచార ప్రకటనలు ప్రచురితం చేయదలచిన వారు తప్పనిసరిగా ఎంసీఎంసీ ద్వారా ముందస్తు అనుమతి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే రీతిలో ఆవేశపూరితమైన, తప్పుదోవ పట్టించే, ద్వేషపూరిత ప్రకటనలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వబడదని స్పష్టం చేశారు.

పోలింగ్‌కు 48 గంటల ముందు బల్క్ ఎస్ఎంఎస్‌లు పంపడం నిషేధం..

ఈ నెల 13న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో 48 గంటల నిశ్శబ్ద వ్యవధి అమలులో ఉంటుందని నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. సైలెన్స్ పీరియడ్‌లో భాగంగా 11-05-2024 సాయంత్రం 6.00 గంటల నుంచి 13-05-2024 సాయంత్రం 6.00 గంటల వరకు ఎలాంటి అభ్యంతరకరమైన, రాజకీయపరమైన అంశాలతో కూడిన సంక్షిప్త సందేశాలు, బల్క్ ఎస్ఎంఎస్‌లపై ఎన్నికల సంఘం నిషేధం విధించిందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పోలింగ్‌కు ముందు 48 గంటల సైలెన్స్ పిరియడ్‌లో ఎవరు కూడా రాజకీయపరమైన ఎస్ఎంఎస్‌లు, బల్క్ ఎస్ఎంఎస్‌లను పంపకూడదని కలెక్టర్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే బల్క్ ఎస్ఎంఎస్‌లను నిశితంగా పర్యవేక్షించనున్నట్టు పేర్కొన్నారు. సైలెన్స్ పీరియడ్‌లో నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ ఎవరైనా అభ్యంతరమైన ఎస్ఎంఎస్‌లు, రాజకీయపరమైన బల్క్ ఎస్.ఎం.ఎస్‌లు పంపితే విచారణ జరిపి భారత శిక్ష స్మృతి (ఐపీసీ) ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, ఎన్నికల ప్రవర్తనా నియమావళి 1961 ప్రకారం జారీ చేయబడిన సూచనలు/ఆదేశాల మేరకు బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. అదేవిధంగా ఎస్ఎంఎస్‌లను పంపడానికి అయ్యే ఖర్చులను కూడా పరిగణలోకి తీసుకోనున్నట్టు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పష్టం చేశారు.

పోలింగ్ రోజు 13న వేతనంతో కూడిన సెలవు..

ఈ నెల 13న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ జరగనున్న సందర్భంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించిందని నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న సోమవారం అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలకు, పరిశ్రమలకు వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించారని కలెక్టర్ తెలిపారు.

ఎన్నికల్లో ప్రలోభాలను

నిలువరించేందుకు గట్టి నిఘా

- ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశంలో అబ్జర్వర్లు
- రెట్టింపు సంఖ్యలో నిఘా బృందాల ఏర్పాటు : కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు సమయం సమీపించిన నేపథ్యంలో ఎన్నికలు పూర్తి పారదర్శకంగా, ఎలాంటి ప్రలోభాలకు అవకాశం లేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు సంబంధిత విభాగాల అధికారులు, ఇంటెలిజెన్స్ బృందాలు గట్టి నిఘాను కొనసాగిస్తూ అంకితభావంతో పనిచేయాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్, వ్యయ పరిశీలకులు డీ.ఎం.నెష్మీలు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నేతృత్వంలో జరిగిన ఇంటలిజెన్స్ కమిటీ సమావేశంలో పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ.. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే డబ్బు, మద్యం, విలువైన వస్తువులు, ఇతర కానుకలు, మత్తు పదార్థాలు తదితర వాటిపై గట్టి నిఘా ఉంచాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్స్, స్టాటిస్టికల్ సర్వేలెన్స్, వీడియో వీవింగ్ బృందాలు సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. అనుమానాస్పద ఆన్‌లైన్ బ్యాంకు లావాదేవీల నిశితంగా పరిశీలించాలని, అధిక మొత్తంలో నగదు బదిలీ జరిగే ఖాతాలను గుర్తించాలని లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ రావును ఆదేశించారు. అక్రమ మద్యం నిల్వలు, మద్యం రవాణాపై దాడులు నిర్వహించాలని, ఐ.ఎం.ఎల్ డిపో నుంచి దిగుమతి చేసుకుంటున్న మద్యం నిల్వలు ఎక్కడైనా పక్కదారి పడుతున్నాయా అని నిఘా ఉంచాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు. పోలింగ్‌కు సమయం సమీపించినందున మరింత అప్రమత్తతతో పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని నిఘా బృందాల అధికారులకు సూచించారు.

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. ఆబ్కారీ, రవాణా, వాణిజ్య పన్నులు తదితర శాఖల సిబ్బందితో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారని అన్నారు. తనిఖీలను మరింత ముమ్మరం చేయిస్తామని పరిశీలకులకు తెలిపారు. అలాగే ప్రస్తుతం పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో 21 ఎఫ్.ఎస్.టీ బృందాలు నిఘా కొనసాగిస్తున్నాయని, వాటి సంఖ్యను రెట్టింపు చేస్తామని, 22 ఎస్.ఎస్.టీ బృందాల సంఖ్యను కూడా 30కు పెంచుతామని వివరించారు. ఆర్టీసీ బస్సులలో కార్గో సేవల ద్వారా, రైల్వే మార్గం ద్వారా ఏవైనా వస్తువులను ఎన్నికలలో ప్రలోభాల కోసం పంపిస్తున్నారనే అనుమానం కలిగితే, వెంటనే అధికారులకు సమాచారం అందించేలా సంబంధిత అధికారులను అప్రమత్తం చేశామన్నారు.

సీ.పీ కల్మేశ్వర్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి విస్తృత తనిఖీలు చేస్తూ పలుచోట్ల నగదుతో పాటు మద్యాన్ని పట్టుకున్నామని అన్నారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో సమిష్టిగా కృషి చేస్తూ అక్రమ నగదు, మద్యం, వస్తువుల పంపిణీ వంటి ప్రలోభాలకు అడ్డుకట్ట వేసేలా గట్టి నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పట్టింపులేని పాలన

- లచ్చన్ గ్రామంలో కంపు కొడుతున్న మురికి కాలువలు
- అవస్థలతో కాలనీవాసులు

నవతెలంగాణ-మద్నూర్

తెలంగాణ రాష్ట్రంలో సర్పంచుల పదవీకాలం ముగియగానే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగిస్తుంది. పట్టింపు లేని ప్రత్యేక అధికారుల పాలనతో గ్రామాల్లో మురికి కాలువలు శుభ్రపరచకపోవడంతో కంపు కొడుతున్నాయి.

మండలంలోని లచ్చన్ గ్రామంలో మురికి కాలువల పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. మురికి కాలువలు శుభ్రపరచకపోవడంతో కంపు కొడుతోంది. మురికితో కాలనీవాసులంతా అవస్థలు ఎదుర్కొంటున్నామని లచ్చన్ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురికి కాల్వల శుభ్రత పట్ల గ్రామ కార్యదర్శికి, గ్రామ ప్రత్యేక అధికారికి తెలియజేసినా పట్టించుకోవడంలేదని ఆ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు మండుతున్న ఎండలు.. మరోవైపు మురికి వాసనతో ఇబ్బందులు పడతున్నామని అంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అధికారులు బిజీబిజీగా ఉండటంతో పంచాయతీ పాలన పట్టించుకునే వారే కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



డ్రయినేజీలో నిలిచిపోయిన మురికి నీరు

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం

- ఎండిపోయిన పంట పొలాలు
- ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయిందని ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- సుమారు నాలుగెకరాల పంట నష్టం



కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్



నీరందక ఎండిపోయిన వరి పంట

నవతెలంగాణ-కామారెడ్డి

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో పంటలు ఎండిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయిందని ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో సుమారు రూ.రెండులక్షల వరకు పంట నష్టం వాటిల్లినట్టు రైతులు చెబుతున్నారు.

కామారెడ్డి మండలం నరసన్నపల్లి శివారులోని ఇంటి వెనక సిద్దయ్య, కొట్టాలపల్లి గ్రామానికి చెందిన బాలయ్యకు సంబంధించిన నాలుగు ఎకరాల పొలానికి నీరు అందక ఎండిపోయింది. ఈ రైతులిద్దరికీ కలిపి ఒకే ట్రాన్స్‌ఫార్మర్ (చిన్నది) ఉంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో ఇంటి వెనక సిద్దయ్యకు మూడు ఎకరాల భూమి, కొట్టాలపల్లి గ్రామానికి చెందిన బాలయ్యకు మూడెకరాలనర పొలం ఉండగా.. గత రెండునెలల క్రితం వీరిద్దరికీ సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో వారు విద్యుత్ శాఖ ఏఈకి ఎన్నిసార్లు ఫోన్లు చేసినా.. వస్తానని చెప్పినా.. ఆ అధికారి రాలేదు. దీంతో ఇంటి వెనక సిద్దయ్యకు చెందిన మూడు ఎకరాల పొలం, బాలయ్యకు చెందిన ఎకరం పొలం పూర్తిగా ఎండిపోయింది. వీరిద్దరికీ కలిపి సుమారు రూ.2లక్షల వరకు పంట నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎకరం ఎండిపోయింది



ఈ యాసంగిలో మూడెకరాల భూమిలో వరి పంట వేశాను. రెండు నెలల క్రితం మా ట్రాన్స్‌ఫారం కాలిపోయింది. ఏఈకి ఎన్నిసార్లు ఫోన్‌చేసినా రాలేదు. దాన్ని బాగు చేయలేదు. దీంతో గత్యంతరం లేక నా పక్కన ఉన్న బోరు నుంచి నీరు తీసుకొని రెండు ఎకరాల్లో పంట పండించుకున్నాను. ఎకరం పొలం ఎండిపోయింది.

- కొట్టాల్‌పల్లి సిద్దయ్య

బిచ్కుంద మండల సర్వసభ్య సమావేశం వాయిదా

నవతెలంగాణ-బిచ్కుంద

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. పార్లమెంట్ ఎలక్షన్ నేపథ్యంలో మండల డివిజన్ అధికారులకు ప్రత్యేక విధులు ఉండడంతో ఈ సమావేశానికి ఎంపీటీసీలు హాజరు కాకపోవడంతో పూర్తిస్థాయి కోరం లేనందున వాయిదా వేసినట్లు ఎంపీడీవో గోపాలకృష్ణ తెలిపారు.

బీజేపీని చిత్తుగా ఓడించాలి

- సీపీఐ(ఎం) ఎల్లారెడ్డి ఏరియా కార్యదర్శి మోతీరాం నాయక్

నవతెలంగాణ-గాంధారి



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

ప్రజా రైతాంగ కార్మిక మహిళా వ్యతిరేకి బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించాలని.. ఇండియా కూటమి అభ్యర్థి సురేష్ షెట్కర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సీపీఐ(ఎం) ఎల్లారెడ్డి ఏరియా కార్యదర్శి మోతీరాం నాయక్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో బుక్‌లెట్ కరపత్రాలను విడుదల చేశారు. గత పది సంవత్సరాల కాలంలో బిజెపి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా ప్రజలకు భారంగా మారిందని దోపిడీ దారుడుగా తయారైందని అన్నారు. ఈ దేశంలో 70 ఏండ్ల సంపాదనను ఆదాని, అంబానీకే కట్టబెట్టారని తెలిపారు. ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టారని వివరించారు. మణిపూర్ లాంటి ప్రాంతంలో మహిళలకు నగ్నంగా ఊరేగించారని తెలిపారు. అత్రాస్ ప్రాంతంలో దళిత అమ్మాయిని రేప్ చేసి చంపేసి శవాన్ని కాల్చి బూడిద చేశారని వివరించారు. ఢిల్లీలో రైతులు 13 మాసాలపాటు నల్లచట్టాలను రద్దు చేయాలని పోరాటం చేస్తే 1100 మంది రైతులు చనిపోయారని, బీజేపీ ప్రభుత్వం ఏ ఒక్కరికి కూడా న్యాయం చేయలేదన్నారు. పెట్రోల్, డీజిల్, ఉప్పు, పప్పు, నిత్యావసర ధరలను పెంచి ప్రజలను ఏమీ కొనుగోలు చేయని స్థితిలోకి నెట్టివేశారని తెలిపారు. ప్రజావ్యతిరేక, కార్మిక వ్యతిరేక, మహిళా వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు మధు, సరాఫ్ కిషన్‌రావు, ప్రకాష్ నాయక్, బలరాం, సామ్యానాయక్, గొల్ల సింగ్, బలరాం రైతులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మాజీ ఎంపీపీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జక్రాన్ పల్లి మాజీ ఎంపీపీ అనంత్ రెడ్డి కలిసి సంతోషాన్ని వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నిజామాబాద్ పర్యటకు వచ్చిన సందర్భంగా నిజాంబాద్ హెలిప్యాడ్ వద్ద మాజీ మంత్రి మాండవ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు.


సీఎంతో మాజీ ఎంపీపీ

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
నిజామాబాద్
శుక్రవారం | మే 10, 2024 | www.navatelangana.com

పోలింగ్ కేంద్రాల్లో

తాగునీరు, టాయిలెట్స్, విద్యుత్ వసతుల పరిశీలన

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ
నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని మాక్లూర్, నందిపేట్, డొంకేశ్వర్, ఆలూరు మండల కేంద్రాల్లోని పోలింగ్ స్టేషన్లను ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్ గురువారం సందర్శించారు. ఆయా పోలింగ్ స్టేషన్ల పరిధిలో ప్రస్తుత పరిస్థితులను పరిశీలించారు. అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, టాయిలెట్స్, విద్యుత్ సదుపాయం వంటి వసతులు అందుబాటులో ఉన్నాయా.. లేదా అని పరిశీలించారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఓటర్లకు నీడను అందించేలా టెంట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అబ్జర్వర్ వెంట ఎస్సీ కార్పొరేషన్ ఈ.డీ రమేష్, తహశీల్దార్లు, ఇతర అధికారులు ఉన్నారు.

ఉంగూరు ప్రచారంలో దెగం యాదాగౌడ్


చింతమనేని ప్రభాకర్‌తో యాదాగౌడ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
ఆంధ్రప్రదేశ్‌లోని దెందులూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ని ఆయన స్వగ్రామంలో కలిసి ఆయనతో పాటు ఉంగూరు గ్రామంలో ప్రచారంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా యాదాగౌడ్ మాట్లాడుతూ.. చింతమనేని ప్రభాకర్ పేదవారి గుండెల్లో ఉన్నారని, తమ కష్టాలను తన కష్టంగా భావించి అండగా నిలబడే వ్యక్తి అని అక్కడి వారు అంటున్నారని తెలిపారు. అక్కడ వైసిపి వారు ఒక టీడీపీ కార్యకర్త ఇల్లును కూలదోయడంతో మీరు ఎందుకు అడ్డుపడలేదు నేను లేనా.. అని అన్నమాటలు అక్కడున్నవారి జవాబు వింటే కుటుంబసభ్యులతో మాట్లాడుకున్నట్లు ఆయన ఆప్యాయత ఉందని తెలిపారు. సర్వేల్లో ఆయన ఓడిపోతున్నారంటూ వస్తున్న ప్రచారం తప్పుగా అనిపిస్తుందని, రాష్ట్రంలోనే తెలుగుదేశం కూటమి వైసిపి నీ క్లిన్ స్వీప్ చేసే రిజల్ట్ కనబడుతుందని అన్నారు. వైసిపి దాడులకు భయపడి ఓటు కూటమికి వేస్తున్నట్లు నిర్ణయించుకున్నారనేది తెలుస్తుందని అన్నారు. జూన్ 4 న చంద్రబాబు ను ముఖ్యమంత్రిగా ప్రకటించడం చూస్తామని, పిడుగురాళ్ల నుండి ఏలూరు గోదావరి జిల్లాలవరకు తిరిగి చూసిన అనుభవం అని అన్నారు. కార్యక్రమంలో నాతో పాటు మైనారిటీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎండీ ఫిరోజ్ , నిజామాబాద్ అర్బన్ ఉపాధ్యక్షుడు వేముల నాగేశ్వర్ రావు పాల్గవున్నారు.

క్రికెట్ విజేతలకు ట్రోఫీ అందజేత


ట్రోఫీ అందుకుంటున్న జట్టు

నవతెలంగాణ-ఆర్మూర్
క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ట్రోఫీని గురువారం అందజేశారు. పట్టణంలోని మినీ స్టేడియంలో గత రెండు రోజుల నుండి బాలక్ రామ బ్రాహ్మణ క్రికెట్ టోర్నమెంట్ సీజన్-2 నిర్వహించారు. కెప్టెన్ సుధీర్ శర్మ వైస్ కెప్టెన్‌గా భార్గవ్ వ్యవహరించారు. బాసర, నిజామాబాద్, జగిత్యాల, ఆర్మూర్, ఖానాపూర్ పట్టణాల్లో టీమ్‌లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా కెప్టెన్ సుధీర్ శర్మ మాట్లాడుతూ.. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో జగిత్యాల జట్టుపై ఆర్మూర్ జట్టు విజయం సాధించిందని, భారతి నృత్య నికేతన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆ భినయ్, పవన్ జోషి ,మణి కృష్ణ , రిషికేష్ దీపక్, శివ, రాజేశ్వర శర్మ, వినోద్, జోషి ,దీక్షిత్ ,శివరామకృష్ణ, రిషికేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల వద్ద

ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న ఆరోగ్య విస్తరణ అధికారి

నవతెలంగాణ-డిచ్‌పల్లి
ఈనెల 13 న జరిగే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ బూత్‌ల వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆశా కార్యకర్తలను ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్ ఆదేశించారు. గురువారం ఇందల్ వాయి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తల నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ మాట్లాడుతూ.. తీవ్రమైన ఎండల దృశ్యా కచ్చితంగా ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. వడదెబ్బ నివారణ చర్యలు, తీసుకోవలసిన జాగ్రత్తల పై అవగాహన కల్పిస్తూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేయాలని సూచించారు. స్త్రీల నమోదు, ఐదు సార్లు గర్భిణీ స్త్రీకి చికిత్సలు శిశువులకు సరైన సమయంలో టీకాలు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలపై సమీక్ష నిర్వహించారు. ప్రతి ఒక్క గర్భిణి ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవం అయ్యేలా చూడాలని శస్త్ర చికిత్సల ద్వారా కలిగే పరిణామాలు వారికి వివరించాలని అన్నారు. ఇంటింటికి వెళ్లి గర్భిణీ స్త్రీలలో సరియైన అవగాహన ధైర్యం నింపాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

లక్కోరా గ్రామ యువకులు కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
వేల్పూర్ మండలం లక్కోరా గ్రామానికి చెందిన యువకులు గురువారం బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన చిన్న స్వామి, జయరాజ్, ప్రేమ్ రాజ్, అక్షయ్, అభి, చందు, ప్రభాస్, చరణ్, ద్వారకేష్, గంగారెడ్డి, హరీష్, దిన్ను తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.వారందరికీ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఆరు గ్యారంటీ లతోపాటు దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను గ్రామాల్లో ఇంటింటికి చేరవేయాలి అన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవన్‌రెడ్డి గెలుపుకోసం కష్టపడి పనిచేయాలి

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ- (వేల్పూర్)ఆర్మూర్
కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డి గెలుపు కోసం కష్టపడి పని చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు నర్సారెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కవిత, అరవింద్‌ను గెలిపించడం ద్వారా పది సంవత్సరాలుగా నిజామాబాద్‌లో జరిగిన అభివృద్ధి ఏమీలేదని అన్నారు. కవిత తన వ్యాపారాల కోసం పదవిని వాడుకుందని, అరవింద ప్రచారం కోసం మాత్రమే కాలాన్ని గడిపారని, నిజామాబాద్ అభివృద్ధికి పాటుపడలేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇచ్చిన ఆరు గారెంటీలలో ఐదు గ్యారంటీలను నెరవేర్చిందని ఆయన తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్ రెడ్డి గారిని గెలిపించడం ద్వారా కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రాగానే జీవన్‌రెడ్డికి కేంద్రమంత్రి పదవి వస్తుందని అన్నారు. రాని పక్షంలో మన సమస్యలను పార్లమెంటులో మన గొంతుకగా జీవన్ రెడ్డి వినిపిస్తారని తెలిపారు. కవిత గాని, అరవింద్ గాని పార్లమెంటులో నిజామాబాద్ ప్రజల సమస్యలపై మాట్లాడలేదని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిజామాబాద్ జిల్లాలో మహిళా కళాశాల, ఇంజనీరింగ్ కాలేజ్ ఏర్పాటు చేస్తామని, పసుపు బోర్డు ఏర్పాటు చేసే దిశగా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని, చక్కర కర్మాగారాలు తెరిపించి రైతులకు అండగా నిలుస్తుందని మానాల మోహన్ రెడ్డి తెలిపారు. అదే విధంగా రాహుల్ గాంధీ ఇచ్చిన పంచ న్యాయాలను కూడా అమలు చేస్తామని రైతులకు రుణమాఫీ చేసి మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని అన్నారు. ప్రతి పేద మహిళకు సంవత్సరానికి లక్ష రూపాయలు అందిస్తామని, కులగణన చేసి ప్రతి వర్గానికి సమాన న్యాయం అందిస్తామని, ఉపాధి హామీ కూలీలకు 400 రూపాయల కూలి ఉండే విధంగా చూస్తామని, చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని మానాల మోహన్ రెడ్డి తెలిపారు. జీవన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమం లో జిల్లా జనరల్ సెక్రెటరీ దామోదర్ గౌడ్, టౌన్ అధ్యక్షులు మల్లేష్, నరేందర్, రమణ, రాజేందర్, వైపి రెడ్డి, ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షులు హర్షిత్ గౌడ్, గ్నైరాయి సతీష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. గురువారం బాల్కొండ నియోజకవర్గంలోని రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రాంగి మండలం మానాల గ్రామ పరిధిలోని దేగవత్ తండా, వీరున్ తండలలో ఆయన వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి జీవన్ రెడ్డిని గెలిపించాలని ఉపాధి హామీ పని ప్రదేశంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా మానాల గ్రామంలోని ముదిరాజ్, మున్నూరు కాపు సంఘాల నాయకులతో, సభ్యులతో కాంగ్రెస్ గెలుపుకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే మానాల గ్రామంలో అభివృద్ధి జరిగిందన్నారు. పది సంవత్సరాలు బీఆర్ఎస్ పాలకులు మానాల గ్రామాన్ని నిర్లక్ష్యం చేశారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున మానాల గ్రామ అభివృద్ధి తప్పకుండా జరుగుతుందని, దాని బాధ్యత తాను తీసుకుంటానని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాహుల్ గాంధీ ఇచ్చిన ఐదు గ్యారంటీల మేరకు యువతకు మొదటి సంవత్సరంలోనే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. రైతులకు రైతు రుణమాఫీ చేసి పండించిన పంట యొక్క మద్దతు ధరకు చట్ట భద్రత కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. పేద మహిళలకు ప్రతి సంవత్సరం లక్ష రూపాయలు అందిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డికి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో రుద్రంగి మండల తూము జలపతి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి దేవేందర్, నాయకులు జక్కు మోహన్, గ్రామ అధ్యక్షులు దిలీప్ పాల్గొన్నారు.

హామీలు విస్మరించిన పార్టీలకు ఓటుతో వాత పెట్టాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి
- అమీర్‌నగర్, కోనాపూర్‌లో బైక్‌పై వెళ్లి ప్రచారం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ప్రజలు తిరస్కరిస్తారనే భయం కలిగేలా, హామీలు విస్మరించిన కాంగ్రెస్, బిజెపి పార్టీలకు ఈ పార్లమెంటు ఎన్నికల్లో వాతలు పెట్టాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బిజేపీ హామీల అమలులో విఫలమయ్యాయని తెలిపారు. హామీల అమలు కోసం ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించే బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి ని గెలిపించాలన్నారు. గురువారం మండలంలోని అమీర్ నగర్, నర్సాపూర్, కోనాపూర్ గ్రామాల్లో ఉపాధి పని ప్రదేశంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అనేక అలవి కానీ హామీలు ఇచ్చి ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజాపాలన, మార్పు కోసం అంటూనే కరెంట్ కోతలు, తాగు, సాగు నీరు అందించడంలో కాంగ్రెస్ మార్పులు తీసుకొచ్చిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 100 రోజుల గడువు దాటి 150 రోజులు అయినా ఎందుకు హామీలు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. ఎంపీ ఎన్నికల సమయంలోనే హామీలు అమలు చేయని కాంగ్రెస్ ఎన్నికలు అయిపోయాక పట్టించు కోదని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి ఎమ్మెల్సీగా ఏనాడు ఇక్కడ ప్రాంత ప్రజల మంచి చెడుకు రాలేదన్నారు. ఐదు రోజుల్లో పసుపు బోర్డు తీసుకొస్తానని మాటిచ్చిన అరవింద్ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికి పసుపు బోర్డు తేలేదన్నారు. గ్రామాలకు ఒక్క రూపాయి కూడా అభివృద్ధికి నిధులు ఇవ్వని వ్యక్తికి ఎందుకు ఓట్లు వేయాలో ఆలోచన చేయాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలకు శాసనసభ ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అమలు చేస్తామని ఇచ్చిన హామీల ఆడియోలను వినిపించారు. కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ కార్డును చూపిస్తూ ఒక్కో హామీపై అమలు జరిగిందా.. అంటూ ప్రశ్నించగా కాలేదంటూ ప్రజలు పెద్ద ఎత్తున సమాధానమిచ్చారు. హామీలు అమలు చేయకుంటే ప్రజలు తిరస్కరిస్తారు అనే భయం ఆ పార్టీల నాయకుల్లో కలిగేలా ఓటుతో వాత పెట్టాలన్నారు. మీ ఓటును బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి కి వేసి నాకు తోడుగా ఇవ్వాలని కోరారు. అమీర్ నగర్, కోనాపూర్ గ్రామాల్లో ఉపాధి పని ప్రదేశంలో కూలీలను కలిసి ప్రచారం నిర్వహించేందుకు తన వాహనం వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి కార్యకర్త బైక్‌పై వెళ్లి ప్రచారాన్ని నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, పెరుమండ్ల రాజా గౌడ్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, నాయకులు లుక్కు గంగాధర్, మాలవత్ ప్రకాష్, మాజీ ఎంపీపీ మలావత్ కౌసల్య, ఎంపీటీసీలు బుస్సాపురం సుప్రియ నవీన్ యాదవ్, లకావత్ గంగాధర్, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పలు ఆలయాల్లో దొంగతనం

నవతెలంగాణ - మాక్లూర్
మండల కేంద్రంలో పలు ఆలయాల్లో, అలుర్ మండలంలోని డికంపల్లి గ్రామంలోని ఆలయంలో బుదవారం అర్ధరాత్రి దొగలు పడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ, బీమయ్య, పెద్దమ్మ ఆలయంలో తాళం పగుల గొట్టి ఎల్లమ్మ ముక్కు పుడక అరతులం వెండిది, ఇత్తడి తాంబూలం, పెద్దమ్మ ఆలయంలో అమ్మవారి పుస్తెల తాడు నాలుగు మాసాల బంగారం, కండ్లు మాసం వెండి, హుండిలోని డబ్బులు దొంగలించారు. భీమన్న గుడిలో ఏమి దొరుకలేవు. ఆలూరు మండలంలోని డీకంపల్లి గ్రామంలోని పెద్దమ్మ ఆలయంలో పుస్తెలు దొంగలించారని తెలిపారు. సంఘటన స్థలానికి పోలీసులు వచ్చి పరిశీలించారు.



ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకోవాలి

- దేశం అభివృద్ధి కావాలంటే సరైన నాయకున్ని ఎన్నుకోవాలి
- భవిష్యత్తును మార్చే సత్తా ఓటుకు ఉంది
- సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్



మాట్లాడుతున్న దత్తాద్రిగౌడ్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
ప్రతి పౌరులు ఓటు హక్కును వినియోగించుకోవాలని సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు దత్తాద్రి గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో దత్తాద్రిగౌడ్ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటును వినియోగించుకోవాలన్నారు. దేశం అభివృద్ధి కావాలంటే సరైన నాయకున్ని ఎన్నుకోవాలన్నారు. మీ భవిష్యత్తును మార్చే సత్తా ఓటుకి ఉందని తెలిపారు. ఓటర్ లిస్టులో మీ పేరు లేకపోయినా ఓటు గుర్తింపు కార్డు లేకపోయినా, ఆధార్ కార్డు చూపించి సెక్షన్ 49 ఏ క్రింద "చాలెంజ్ ఓటు" అడిగి వినియోగించువాలన్నారు. ఒకవేళ వెళ్ళేటప్పటికీ ఓటు వేరే ఎవరైనా వేసినట్లయితే టెండర్ ఓటు 49పి అడిగి ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. సంబంధిత బూత్ స్థాయిలో కానీ 14శాతం టెండర్ ఓట్లు పోలైన సంబంధిత బూత్ స్థాయిలో మరల పోలింగ్ జరపాలని వారు కోరారు. ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, భ్రూణ హత్యలు, అక్రమ రవాణా, వెట్టి చాకిరి, కార్మిక నిర్మూలన, బాల కార్మిక చట్టం, విద్య హక్కు చట్టం ద్వారా తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో మండల ఎడ్యుకేషన్ చైర్మన్ కొప్పు రాజేందర్. మండల వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

ఉపాధి పనులు కల్పించింది కాంగ్రెస్ పార్టీయే


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-ధర్పల్లి
దేశంలోని పేద, ధనిక అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలకు ఉపాధి హామీ పనులు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదే నని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని దమ్మన్నపేట్,భేల్యా తండా గ్రామాల్లో జరుగుతున్నా ఉపాధి హామీ పనులవద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో అన్ని వర్గాలకు ప్రభుత్వ పథకాలు అందుతాయని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పాలన చేయాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డికి ఓటేసి అధిక మెజారిటీతో గెలిపించుకున్నట్లైతే రాష్ట్రం, గ్రామం మరింత అభివృద్ధి అవుతుందని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చెలిమెల నర్సయ్య, చెలిమెల శ్రీనివాస్,రావు సింగ్,దావూజీ,తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి :మండలంలోని వివేక్ నగర్ తాండాలో జాతీయ ఉపాధి పనులు జరుగుతున్న చోట మండల కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిపల్లి పెద్ద సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ నర్సారెడ్డి, ఆర్మూర్ గంగారెడ్డి, సొప్పరి వినోద్, డిష్ రాజు, తిరుపతి, పిర్య, మాజీ ఎంపీటీసీ-1 గడ్డం గంగారెడ్డి, సైకిల్ ట్యాక్స్ అక్బర్, రైమాత్ అలీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పసుపు తక్కువ పండించడంతోనే ధర పెరిగింది : సిపిఐ


కరపత్రాల ప్రచారం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
పసుపుకు గిట్టుబాటు ధర రాకపోవడం వల్లనే పసుపు రైతులు పసుపు పండించడం తక్కువ చేయడం మూలంగా ప్రస్తుతం మార్కెట్లో పసుపు ధర పెరిగింది అని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో గురువారం నిజామాబాద్ నగరంలో రైల్వే స్టేషన్ నుండి బస్టాండ్ మీదుగా కూరగాయల మార్కెట్ వరకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.సుధాకర్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో ధర్మపురి అరవింద్ పసుపు బోర్డు తెస్తానని రాతపూర్వక హామీ ఇచ్చి ఏ బోర్డు తేలేదన్నారు. గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు సాగు తక్కువ చేయుట మూలంగా ప్రస్తుతం మార్కెట్‌లో పసుపు రాకపోవడంతో పసుపు ధర పెరిగిందని కానీ ధర్మపురి అరవింద్ పసుపు ధరను తానే పెంచినట్టు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని అన్నారు. దేశంలో బీజేపీ రైతాంగానికి వ్యతిరేకంగా తెచ్చిన 3 నల్ల చట్టాలను రద్దు చేయకపోగా కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను 4 కోడ్ లుగా మార్చి కార్మిక శాఖకు కార్మికులకు సంబంధాలు లేకుండా చేశారని అన్నారు. అయోధ్య అక్షింతల పేరుతో ప్రజలతో మైండ్ గేమ్ ఆడుతున్నారని తెలిపారు. పది సంవత్సరాల్లో ఏ ఒక్క ప్రభుత్వ రంగ నూతనంగా తేకపోగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటుపరం చేస్తూ అంబానీ, ఆదానీలకు అప్పచెప్పారని అన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన ఇండియా కూటమి అభ్యర్థి టి జీవన్ రెడ్డి ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ కార్యదర్శి వై.ఓమయ్య, సిపిఐ నాయకులు బి.రఘురాం, ఆలీ ఇమ్రాన్, కే.గంగాధర్,ఆనంద్ పాల్గొన్నారు

ఉపాధి కూలీలవద్ద ప్రచారం

నవతెలంగాణ-ఆర్మూర్
మతోన్మాద, ఫాసిస్టు బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని ఇండియా కూటమి అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు దాస్ తెలిపారు. గురువారం పేద బడుగు బలహీన ప్రజల సంక్షేమాన్ని మోడీ ప్రభుత్వం విస్మరించిందని అన్నారు. దాదాపు కోటి మందికిపైగా ప్రజలు ఉపాధి పని చేస్తున్నారని, వారికి పనిరోజులు పెంచి కూలి పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఎన్నికల్లో మోడీ ఇచ్చిన వాగ్దానాలను విస్మరించి, ప్రభుత్వ సంపదను పెట్టుబడిదారులకు అప్పజెప్పే కుట్ర చేస్తున్నారని వారు అన్నారు. జీవించే హక్కును హరిస్తున్న మతోన్మాద, ఫాసిస్టు బిజెపి కూటమిని ఓడించి, ఇండియా కూటమి అభ్యర్థి జీవన్ రెడ్డి కు గెలిపించాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ ప్రచార క్యాంపెన్లో పార్టీ నాయకులు సూర్య శివాజీ, ఎస్ వెంకటేష్, గోవింద్ పెట్ సాయన్న, ప్రిన్స్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిబిరం పరిశీలన


వేసవి క్రీడా శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని బొల్లారం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిబిరాన్ని కామారెడ్డి జిల్లా యువజన క్రీడ అధికారి దామోదర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 14 సంవత్సరాలలోపున్న విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమ్మర్లో యువకులందరూ క్రీడలలో పాల్గొనాలని ఆయన అన్నారు. ప్రతిరోజు క్రీడలు ఆడటం వలన ఆరోగ్యంగా ఉంటారని ఆయన అన్నారు. సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్న నరేష్‌రెడ్డిని పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం



ప్రతిజ్ఞ చేయిస్తున్న రాజేందర్

నవతెలంగాణ-గాంధారి

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్మెంట్ (ఐ.ఎస్.ఆర్.డి) స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి అమృత రాజేందర్ తెలిపారు. మండలంలోని పోతంగల్ ఖుర్దు గ్రామంలో ఉపాధిహామీ కూలీలకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎస్.ఆర్.డి సిబ్బంది శివాజీ రావు, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించండి

- జోరుగా నాయకుల ప్రచారం

నవతెలంగాణ-విలేకరుల బృందం

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఉమ్మడి జిల్లాలో గురువారం కాంగ్రెస్ నాయకులు జోరుగా ప్రచారం నిర్వహించారు.

పొతంగల్ : జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని కోడిచర్ల గ్రామంలో ఉపాధి హామీ కూలీలను గురువారం బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి కలిశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్‌కుమార్ షెట్కార్‌ని అత్యదిక మేజార్టీతో గేలిపించాలని కోరారు.

గడప గడపకు కాంగ్రెస్ ప్రచారం

జుక్కల్ : మండలంలోని కౌలాస్ గ్రామంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు గంగారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ యూత్ విభాగంతో కలిసి గడప గడపకు తిరుగుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని నాయకులు కోరారు. సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న సర్కారు.. రాబోయే రోజులలో పార్టీ బలోపేతంతో పాటు, ప్రజల బలం పెరిగి జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీ గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా కాంగ్రెస్ ప్రచారం

నాగిరెడ్డిపేట్ : మండలంలోని గోలిలింగాల గ్రామంలో కాంగ్రెస్ నాయకులు గురువారం జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఓటర్లను వారు కోరారు. కార్యక్రమంలో సురేందర్‌గౌడ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


జుక్కల్: ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


పిట్లంలో...

కాంగ్రెస్ పార్టీ ముమ్మర ప్రచారం

పిట్లం : పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ గెలుపు కోసం మండలంలోని తిమ్మానగర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శివారులో కొనసాగుతున్న ఉపాధి హామీ కూలీలతో చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, నీలబోయిన ప్రవీణ్, గుర్రపు పండరి, నల్లాల వినయ్ కుమార్, బోండ్ల మహేందర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేతి గుర్తుకు ఓటేయండి

లింగంపేట్ : దండం పెట్టి వేడుకుంటున్న చేతి గుర్తుకు ఓటు వేయాలని కాంగ్రెస్ నాయకులు ఓటర్లను వేడుకున్నారు. గురువారం మండలంలోని మోతే, పోల్కంపేట్, లింగంపల్లి, పోతాయిపల్లి, శెట్టిపల్లి సంగారెడ్డి, శెట్టిపల్లి గ్రామాలలో కాంగ్రెస్ మండల నాయకులు ప్రచారాన్ని వేగవంతంగా నిర్వహించారు. ఉపాధి కూలీల వద్దకు వెళ్లి తమ విలువైన ఓటును జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షెట్కర్‌కు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాలలో ఇంటింటికీ కొనసాగుతున్న ప్రచారం

బోధన్ : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు బోధన్, సాలూర మండలంలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గడపగడపకు ప్రచారంలో భాగంగా సాలూర గ్రామంలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతోనే గెలిపించాలని నాయకులు కోరారు. గెలుపే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు గ్రామంలో ఇంటింటికి ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో నాయకులు అల్లె రమేష్, బుయన్ సురేష్, గాండ్ల రాజేశ్వర్, శంకర్ పటేల్, రాజు తదితరులున్నారు.

ఉచిత ఆరోగ్య శిబిరం


ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-బిచ్కుంద

మండలంలోని రాజుల్లా గ్రామంలో రెడ్‌క్రాస్ సొసైటీ, ఎంఎంయూ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా ఆరోగ్య సమన్వయకర్త వైద్యులు విక్రమ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ శిబిరంలో రక్తపరీక్షలు, బిపి, షుగర్, ఈసీజీ లాంటి దీర్ఘకాలిక వ్యాధుల నిర్ధారణ చేసి అవసరమైన మందులు ఇవ్వనున్నట్టు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 37 శిబిరాలు నిర్వహించామని వివరించారు. ఎంపీపీ అశోక్ పటేల్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా పేద ప్రజల కోసం వైద్య శిబిరాలు నిర్వహించడం ఉచితంగా మందులు సరఫరా చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి దస్తీరం, మద్నూర్, బిచ్కుంద మండల చైర్మన్‌లు ప్రకాష్, శివకుమార్ కొలవార్, వైస్ చైర్మన్ శివ కాంత్, కార్యవర్గ సభ్యులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రచారంలో దూసుకుపోతున్న మాజీ ఎమ్మెల్యే



ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే

నవతెలంగాణ-బిచ్కుంద

జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ గెలుపే లక్ష్యంగా జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే తన అనుచరులతో కలిసి ఉదయం నుంచి రాత్రి వరకు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గురువారం జోరుగా ప్రచారం నిర్వహించారు. మండలంలోని బండరెంజల్, గుండెనెమిలి, పెద్దదడ్గి, చిన్నదడ్గి, మాన్యాపూర్, సీతారంపల్లి, ఎల్లారం గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ ముఖ్యంగా మహిళలతో సమావేశాలు ఏర్పాటు చేసి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల అమలు చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీకి దక్కిందని వేరే పార్టీ వాళ్ల చేస్తున్న తప్పుడు వాగ్దానాలకు ప్రజలు మోసపోవద్దని బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట ఎంపీపీ అశోక్ పటేల్, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీహరిరాజు, పార్టీ మండల అధ్యక్షులు వెంకటరావు దేశాయ్, సొసైటీ వైస్ చైర్మన్ రామ్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, మల్లికార్జున్, కార్యకర్తలున్నారు.

ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభం

నవతెలంగాణ-కోటగిరి/మద్నూర్

కోటగిరి మైనార్టీ ఇంటర్మీడియట్ కళాశాలలో 2024-25 సంవత్సరానికి గానూ 75 శాతం మైనార్టీలకు 25శాతం ఇతరులకు మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల విద్యార్థులకు అడ్మిషన్లు ప్రారంభమైనవని, పదవ తరగతి పూర్తయిన విద్యార్థులు ఈ అవకాశం వినియోగించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ ముబీన్ తెలిపారు. ఈ నెల 31వ చివరి తేదీగా తెలిపారు.

మద్నూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ఈనెల 9 నుంచి ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ అయ్యు గ్రివ్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. అడ్మిషన్ల కోసం శ్రీ సేఠ్ రాంప్రసాద్ ఇనాని ప్రభుత్వ జూనియర్ కళాశాల మద్నూర్‌లో ఈ నెల 9 నుంచి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ అయ్యు గ్రీవ్ తెలియజేశారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

జుక్కల్ : మండలంలోని పెద్దగుల్ల గ్రామ సొసైటీ డైరెక్టర్ విట్టల్ పటేల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఖండెబల్లూర్ గ్రామ అధ్యక్షులు రాజు, రాంచందర్, కృష్ణ ఆధ్వర్యంలో గ్రామ యువకులు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో గురువారం చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెలే తోట లక్ష్మీకాంతారావ్, సొసైటీ డైరెక్టర్ విఠల్‌పటేల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలు బీఆర్ఎస్ కార్యకర్తలు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారని తెలిపారు. ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అస్పత్‌వార్ వినోద్, పెద్దగుల్లా, ఖండేభల్లూర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రెంజల్ : గత పది సంవత్సరాలుగా కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో బిఆర్ఎస్, పార్టీలు అధికారంలో ఉండి ప్రజా సమస్యలను పట్టించుకోలేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబిన్ ఖాన్ స్పష్టం చేశారు. గురువారం మండలంలోని దూపల్లి దళితవాడలో స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రాములు, బాబన్న, దళిత సమస్యల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని చెప్పి వారిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. సుమారు 50 మంది కాంగ్రెస్ కండువాను కప్పుకున్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీలకు ఇండ్లు నిర్మించుకోవడానికి ఆరు లక్షల రూపాయలు ప్రభుత్వం అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. రాబోవు కాలంలో రిజర్వేషన్లు తొలగిస్తామని బిజెపి ప్రయత్నం చేస్తుందని దీనివల్ల బడుగు బలహీన వర్గాలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి నాగభూషణంరెడ్డి, ధనుంజయ్, తాజా మాజీ సర్పంచులు శనిగరం సాయిరెడ్డి, ఎమ్మెస్ రమేష్‌కుమార్, బాబన్న, మైనార్టీ జిల్లా సెక్రెటరీ హైమద్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు రవి, హైమద్ చౌదరి, బి రవి, శ్రీనివాస్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని బోర్గం గ్రామ బీఆర్ఎస్ నాయకులు బోధన్ శాసనసభ్యులు పి.సుదర్శన్‌రెడ్డి సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారిలో రెంజల్ సింగిల్ విండో చైర్మన్ మొయినుద్దీన్, మాజీ సర్పంచ్ గొజ్జ రమేష్, సొసైటీ డైరెక్టర్లు పుట్టి సాయిరెడ్డి, ఖదీర్ పాషా, బిఆర్ఎస్ నాయకుడు అతిక్, తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మొబిన్‌ఖాన్, ధనుంజయ్, మాజీ జెడ్పిటిసి నాగభూషణం రెడ్డి, భూమారెడ్డి, గంగాకృష్ణ, కార్తీక్ యాదవ్, సిద్ధ సాయిలు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రమైన రెంజల్ గ్రామానికి చెందిన మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ సమీ, బీఆర్ఎస్ యువజన సంఘం మండల అధ్యక్షులు షబ్బీర్, వార్డ్ మెంబర్ ఇర్ఫాన్ బోధన్ శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువాను కప్పుకున్నారు. వారి వెంట మాజీ జెడ్పిటిసి నాగభూషణ్ రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ ఎంఎస్ రమేష్ కుమార్, అహమ్మద్ చౌదరి, మాజీ ఎంపీటీసీ కవిత, బి రవి, సాయిబాబా గౌడ్, లచ్చేవారు నితీన్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

దోమకొండ : మండలంలోని సంగమేశ్వర్ గ్రామ మాజీ సర్పంచ్ నరేష్‌తో పాటు 20 మంది బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తుందని, కాంగ్రెస్ పార్టీ పథకాలకు ఆకర్షతులై పార్టీలో చేరుతున్నారని, లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ శెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్, వైస్ ఎంపీపీ పుట్ట బాపిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ పల్లె రామస్వామిగౌడ్, జడ్పిటిసి సభ్యులు తీగల తిరుమల గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అనంత రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులున్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిక

సదాశివనగర్ : మండల కేంద్రంలోని పలువురు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పలు సంఘాలు నాయకులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు బొంబోతుల లింగాగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య, కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.


దోమకొండ: కాంగ్రెస్‌లో చేరిన పలువురు


సదాశివనగర్‌లో..

ఆలయ భూములు ఆన్‌లైన్‌లో నమోదు

నవతెలంగాణ-మద్నూర్

దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నారాయణ ఆలయ భూములను గురువారం ఎండోమెంట్ అధికారులు సర్వే నిర్వహించారు. పట్టా భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. శ్రీ లక్ష్మీనారాయణ ఆలయ కమిటీ సభ్యుల ఆదరణను చూసి ఎండోమెంట్ అధికారులు అభినందించారు. మండల కేంద్రంలో గల శ్రీ లక్ష్మీ నారాయణ ఆలయానికి దాదాపు ఇంచుమించు 14 ఎకరాల భూమి కలదు. ఈ ఆలయ భూములు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఎండోమెంట్ ఆధీనంలో ఉన్నందున ఆలయానికి చెందిన భూములు ఎక్కడెక్కడ ఏఏ సర్వే నెంబర్లపైన భూములు ఉన్నాయనేది ప్రతి సర్వే నంబర్‌ను సందర్శించి భూములను పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులంతా పట్టా సర్వే నంబర్ల ప్రకారం భూములను చూపించి అధికారుల ద్వారా ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం చేయించారు. ఆలయ భూములు ముఖ్యంగా ఎకరం 15 గుంటల వరకు పత్తి మిల్లుల భూ కబ్జాలు ఉన్నట్లు చూపించారు. అనంతరం సాగు భూములను సందర్శించి పరిశీలించారు. ఆన్‌లైన్ నమోదు కార్యక్రమంలో ఎండోమెంట్ శాఖ అధికారులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రధాని మోడీ, ఎంపీ అరవింద్‌ను ఓడించాలి

- సిపిఐఎంఎల్ మాస్‌లైన్ నాయకుల స్పష్టీకరణ


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-రెంజల్

దేశ ప్రజలను మోసం చేసిన నరేంద్ర మోడీ, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్‌ను రాబోవు పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలని సిపిఐఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ నాయకులు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాస్‌లైన్ నాయకులు నడిపి నాగన్న, పార్వతి రాజేశ్వర్లు మాట్లాడుతూ.. 2019 ఎన్నికల్లో పసుపు బోర్డును తెస్తానని బాండ్ పేపర్ రాసిచ్చిన ధర్మపురి అరవింద్‌కు ఈసారి ప్రజలు బుద్ధి చెప్తారని వారు పేర్కొన్నారు. ఎర్రజొన్నలకు మద్దతు ధర వచ్చేలా చూస్తానని చెప్పిన ఆయన ఇంతవరకు ఆ హామీని నెరవేర్చలేదని వారు అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు వడ్డేన్న, నడిపి నాగన్న, ఎస్‌కె నజీర్, పార్వతి రాజేశ్వర్, పెద్దులు, ఎల్.గంగాధర్, సంతోష్, పోశెట్టి, లక్ష్మణ్, సాయిలు, మహబూబ్, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ బుద్దె సావిత్రి కుటుంబ సభ్యులను పరామర్శించిన జర్నలిస్టులు



నవతెలంగాణ-బోధన్

బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి భర్త అయిన ప్రముఖ రాజకీయ నేత బుద్దె రాజేశ్వర్ గత 15 రోజుల క్రితం హఠాన్మరణం చెందారు. దీంతో బోధన్ ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు గురువారం సాలూరలోని ఎంపీపీ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా బుద్దె రాజేశ్వర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ బుద్దె రాజేశ్వర్ మనసున్న మంచి నేత అని, జర్నలిస్టుల పట్ల అభిమానంతో మెలగడమే కాకుండా వారిని అన్నివేళలా ఆదుకున్న మహామనిషి అని అన్నారు. అలాంటి నాయకుడు హఠాస్మరణం చెందడం జర్నలిస్టులకు తీరని లోటని తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్టులు గడ్డం గంగులు, వినాయక్ రాజ్, లింబూరి లక్ష్మణ్, ఉమాకాంత్, రమేష్, అఫ్రోజ్, గ్రామస్థులు బొర్ర గంగారాం, అల్లె రమేష్, లక్ష్మణ్, భీమయ్య తదితరులున్నారు.

కాంగ్రెస్ కల్లబొల్లి మాటలు నమ్మొద్దు

- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-కోటగిరి/వర్ని

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 6 గ్యారంటీలు అమలు చేస్తామని కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేసిందని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని 10 సంవత్సరాలలో అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమని తెలిపారు. మండలంలోని లింగాపూర్, కోటగిరి రైతుల గ్రామాలలో ప్రజలతో మమేకమై కారు గుర్తుకు ఓటు వేయలని గురువారం ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ఏనుగు రవీందర్‌రెడ్డి రూ.26 కోట్ల డబుల్ బెడ్‌రూమ్ బిల్లులను ఆపించి నేడు ప్రమాణాల పేరిట మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రెండు లక్షల రూపాయల రుణమాఫీ, మహిళలకు స్కూటీ, ప్రతి నిరుపేద మహిళలకు 2500 అందిస్తామని మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రజలు గమనించి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని ఎంపీగా గెలిపించుకుందాం..


కోటగిరి : ప్రచారంలో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్

వర్ని : జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా రుద్రూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి, పోచారం భాస్కర్‌రెడ్డి ప్రచారంలో మాట్లాడారు. కేసీఆర్ పాలనలో పది సంవత్సరాలు బంగారంలా ఉన్న తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీ అయిదు నెలల పాలనలోనే దారి తప్పిందన్నారు. మళ్ళీ పది సంవత్సరాలు వెనుకకు పోయిందన్నారు.

ఎమ్మెల్యేలను కలిసిన కాంగ్రెస్ పార్టీ నేత


ఎమ్మెల్యేను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-బోధన్

బోధన్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, తెలంగాణ రాష్ట్ర చిట్టెపు కుల సంఘం అధ్యక్షులు సాయిపటేల్ గురువారం వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా అధ్యక్షులు అశోక్ రెడ్డి, నల్గొండ జిల్లా పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు సంజీవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలోని పలు మండలాలకు చెందిన చిట్టెపు కుల సంఘం నాయకులు, కులస్తులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు మండలాలకు చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు సాయిపటేల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం సాయి పటేల్‌ను ఎమ్మెల్యేలు జిల్లా అధ్యక్షులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
శుక్రవారం | మే 10 2024 | www.navatelangana.com

బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలి

- జడ్పీటీసి బాజిరెడ్డి జగన్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజామాబాద్ పార్లమెంటు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలంటూ మండలంలో పలుగ్రామాల్లో ధర్పల్లి జడ్పీటిసి బాజిరెడ్డి జగన్ ప్రచారం నిర్వహించారు. మండలంలోని అర్గుల్ గ్రామంలో జాతీయ ఉపాధిహామీ పనులు నిర్వహిస్తున్న స్థలంలో ఉపాధి కూలీలతో కారు గుర్తుకు ఓటు వేస్తూ బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని కోరారు. ఆయన వెంట మండల బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నట్టభోజనా, ఎంపీపీ కుంచాల విమల రాజు, మండల ఆప్షన్ మెంబర్ బులెట్ అక్బర్ ఖాన్, అర్గుల్ మాజీ ఎంపీటీసీ మాసం లక్ష్మి, కార్యకర్తలు ఉన్నారు.


మాట్లాడుతున్న బాజిరెడ్డి జగన్

జనజాతర సభ ఏర్పాట్లు పరిశీలన

నవతెలంగాణ-కామారెడ్డి

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 11న కామారెడ్డి జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన జన జాతర సభలో ఏఐసీసి అగ్రనేత ప్రియాంక గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో సభ ఏర్పాట్లను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి కేరళ ఎంపీ రాజ్ మోహన్ ఉన్నితన్ సభా ప్రాంగణాన్ని గురువారం పరిశీలించారు.


సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

మహిళ అదృశ్యం

నవతెలంగాణ-కామారెడ్డి



కామారెడ్డి పట్టణంలో మహిళా అదృశ్యమైంది. కామారెడ్డి పట్టణ సిఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గాజుల గల్లికి చెందిన గోజారి సంగీత (50) తేదీ 08-05-2024 న ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కూతురు ఝాన్సీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈమె ఇంట్లో నుంచి వెళ్లేటప్పుడు బ్లూ కలర్ సారీ ధరించి ఉంది. ఈమె ఎడమ చేతిపై బుచ్చవ్వ అనే పచ్చబొట్టు కూడా ఉంటుంది. సంగీత ఆచూకీ తెలిసిన ఎవరైనా కూడా కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం ప్రారంభిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని పోసానిపేటలో గురువారం చలివేంద్రాన్ని గ్రామానికి చెందిన గంద్ర సిద్దవ్వ జ్ఞాపకార్థం గ్రామంలోని బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులకు, ప్రజలకు వేసవి తాపానికి, నీటిని అందుబాటులో ఉంచాలని ఉద్దేశంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకను గెలిపించండి

ఎంపీపీ దశరథ్ రెడ్డి


మాట్లాడుతున్న ఎంపీపీ దశరథ్‌రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

ప్రజా సంక్షేమం కోసం ప్రశ్నించే గొంతుకగా బిఆర్ఎస్‌ను గెలిపించాలని ఎంపీపీ దశరథ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మద్దికుంటలో, గోకుల్‌తండాలో ఉపాధి హామీ కూలీల వద్ద ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దశరథ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదని అన్నారు. మోసపూరిత హామీలతో బిజెపి, కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ను గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో లింబాద్రి నాయక్, గజ్జల శంకర్, తోట లింగం, మైసి సురేష్, ముదాం నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల గుంతలకు మరమ్మతులు

ఎంపీ సురేష్ రెడ్డి చొరవతో


గుంతలకు మరమ్మతులు చేపడుతున్న అధికారులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

గత ఆరు నెలలుగా పెర్కిట్ నుండి కమ్మర్ పల్లి వరకు జాతీయ రహదారి 63పై గతంలో కురిసిన భారీ వర్షాల మూలంగా ఏర్పడ్డ గుంతలకు రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్ రెడ్డి చొరవతో ఆర్ అండ్ బి అధికారులు మరమ్మతులు చేపట్టారు. రెండు రోజుల క్రితం చేపూర్ గ్రామానికి చెందిన ఆదిల్, కొందరు యువకులు పెర్కిట్ నుండి వాహనంలో వెళ్తుండగా కారు గుంతల్లో పడడంతో కారు టైర్ బ్లాస్ట్ అయ్యింది. వారికి పెద్ద ప్రమాదం తప్పింది. అదే దారి వెంట వెళ్తున్న రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్ రెడ్డికి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లడంతో వెంటనే ఆయన మంచిర్యాల రోడ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ తో మాట్లాడారు. గురువారం కమ్మర్ పల్లి నుండి పెర్కిట్ వరకు ఆర్ అండ్ బి అధికారులు మరమ్మతులు చేపట్టి పూర్తి చేశారు. ఇందుకు కృషి చేసిన ఎంపీ సురేష్ రెడ్డికి యువకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ధాన్యం కొనుగోలు వేగంగా పూర్తి చేయాలి

జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్ర మోహన్

నవతెలంగాణ-కామారెడ్డి

ధాన్యం కొనుగోలు వేగంగా పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో గురువారం రైస్ మిల్లుల యజమానులతో ధాన్యం అన్లోడింగ్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యమును కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తక్షణమే రైస్ మిల్లులకు పంపి అన్లోడ్ చేయించుకోవాలన్నారు. రైతుల ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల వివరాలు ట్యాబ్లో కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ఎంట్రీ చేసే విధంగా చూడాలని చెప్పారు. రైతులకు డబ్బులు సకాలంలో అందే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున బాబు, ఇన్చార్జి పౌరసరఫరాల మేనేజర్ నిత్యానందం, డిప్యూటీ తహసిల్దార్లు, రైస్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజెపిలను ఓడించండి

- ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ

తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే బీఆర్ఎస్, బీజేపీలను ఓడించి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు బండపల్లి రాజన్న మాదిగ అన్నారు. గురువారం బాల్కొండ మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజెపి, బీఆర్ఎస్ పార్టీలను ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ పార్టీ ముఖ్యమంత్రిగా కేసీఆర్ అధికారంలో ఉండి, మిగులు నిధులు ఉన్న రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారన్నారు. .తెలంగాణ రాష్ట్రం వస్తే దళితున్ని మొదటి సీఎం చేసి కాపల కుక్కలా ఉంటానని చెప్పి తానే ముఖ్య మంత్రి అయ్యారని అన్నారు. భూమిలేని నిరుపేద కుటుంబానికి మూడు ఎకరాల భూ పంపిణీ చేస్తానని చేయలేదన్నారు. రాష్ట్రంలో ఇల్లు లేని ప్రతినిరుపేదకు డబుల్ బెడ్ రూమ్ లు ఇస్తామని చెప్పి ఎంతమందికి ఇచ్చారో వారి విజ్ఞతకు వదిలి వేస్తున్నామని అన్నారు. ప్రతి దళిత కుటుంబానికి 10 లక్షలు రూపాయలతో దళిత బంధు ఎంతవరకు ఇవ్వగలిగారు, ఇలాంటి పథకాలను ప్రవేశ పెట్టి ప్రజలను మోసం చేశారని తెలిపారు. దొర అహంకారం, కుటుంబ పాలన, మోసపూరిత హామీలు, రాష్ట్రాన్ని అన్ని విధాల దోచుకున్నందుకే ప్రజావ్యతిరేకత వచ్చి ఓడించారని తెలిపారు. దివాలు కోరు రాజకీయాలు చేసిన కెసిఆర్ మళ్ళీ పార్లమెటుకు బీఆర్ఎస్‌ను పంపించండి అని కోరడం విడ్డూరంగా ఉందని అన్నారు. బిజెపి మోడిని చూసి ఓటు వేస్తే ఒరిగేది ఏమిలేదనీ తెలిపారు. కుల, మతాల పేర ప్రజలను రెచ్చగొట్టి అధికారంలోకి రావాలని బిజెపి కుట్రలు చేస్తుందనీ హెచ్చరించారు. మోడి ప్రధానిగా అధికారంలో ఉండి తెలంగాణ రాష్ట్రానికి ఏమి చేశారో చెప్పాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ. ఓసి వర్గాల ప్రజలకు రావలసిన ఫలాలను అందించడంలో వైఫల్యం చెందడమే కాకుండా ఎస్సీ ఎస్టీ అట్రాసిటి చట్టాలను బిజెపి తొలగించడాని ప్రయత్నం చేస్తే దళిత వర్గాలు అడ్డుకొని యదావిధంగా పోరాటం చేసి సాదించుకున్నారు. దళిత జాతి భద్రత కొరకు పెట్టిన ఎస్సీ ఎస్టీ అట్రాసిట్టి చట్టాన్ని తొలగించడానికి ప్రయత్నం చేసిన బిజెపి రిజర్వేషనులను ఎత్తవేయరని గ్యారంటి ఏమిటని ప్రశ్నించారు. బిజెపి, ప్రతి పక్షంగా ఉన్నప్పుడు దళిత ఎస్సీ కులాలను జనాభ థామాష ప్రకారంగా ఎస్సీలను ఏబిసిడిలుగా వర్గీకరించాలని మాదిగ, ఉపకులాలు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తుంటే గతంలో ఆటల్ బిహారి వాజ్‌పేయి వర్గీకరణకు అనుకూలంగా మొదటి లేఖ ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వస్తే వందరోజుల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంటులో పెట్టకుండా ఎందుకు మోసం చేసారో పీఎం మోడి తెలపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగాలను ప్రైవేటీకరణ చేస్తూ, ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్లను ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలన్నారు. మోసపూరిత బిఆర్ఎస్, బిజెపి లను చిత్తుగా ఓడించి, తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రేసు పార్టీకి మెజార్టీ పార్లమెంటు సభ్యులను గెలిపించాలన్నారు. పార్లమెంటు సభ్యులు కోట్లాడి కేంద్రంనుండి నిధులు తీసుకు వస్తారని తెలిపారు. నిజమాబాద్ పార్లమెంటు అభ్యర్థి టి. జీవన్ రెడ్డి కి ఓటు వేసి అత్యధిక మెజార్టీ తో గెలిపించాలని ఎస్సీ ,ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలకు పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు బండపెల్లి రాజన్న మాదిగ, మార్జిన్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుద్దుల గంగా నర్సన్న,మాస్టిన్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుద్దుల నరసన్న ,ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ గుడిసె రమేష్, సాగర్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజన్న మాదిగ

కార్మికుల అంత్యక్రియలకు ఖర్చులు చెల్లించాలి

- సీఐటీయూ వినతి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కార్మికుల అంత్యక్రియల ఖర్చులకు కార్పొరేషన్ సహకరించకపోవడం సరైంది కాదని సిఐటియు నాయకులు అన్నారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కార్యాలయంలో దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్మికులకు చనిపోయినప్పుడు కనీసం అంత్యక్రియల ఖర్చులు కూడా చెల్లించకుండా పాలకవర్గం, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనిగు గురువారం సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఏ. రమేష్ బాబు మాట్లాడుతూ 2014లో అప్పటి మున్సిపల్ డైరెక్టర్ నుండి చనిపోయిన కార్మికుల అంత్యక్రియల ఖర్చులకోసం పదివేల రూపాయలు చెల్లించాలని ఆదేశించినప్పటికీ, వాటిని పాటించలేడంలేదని అన్నారు. 2016 జూలైలో మరొకసారి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నుండి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు చనిపోయిన వారికి అంత్యక్రియల ఖర్చులు 20వేలు చెల్లించాలని సర్క్యులర్ జారీ చేసి ఆదేశించినప్పటికీ జిల్లాలో వాటిని అమలు చేయడానికి మున్సిపల్ అధికారులు కానీ, పాలకవర్గం కానీ చొరవ చూపడంలేదన్నారు. దీంతో అనేకమంది కార్మికులు అంత్యక్రియల ఖర్చులకు కూడా నోచుకోలేకపోతున్నారని, ఇది సరైనది కాదని ఆయన తెలిపారు. అంత్యక్రియ ఖర్చులు చెల్లించాలని గతంలో అధికారులకు మొరపెట్టుకోగా అమలు చేస్తామని హామీ ఇస్తున్నారు తప్ప ఇవ్వటం లేదని అన్నారు. ఇటీవల ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోయిన సందర్భంలో మున్సిపల్ కార్మికులు, అధికారులు జమ చేసుకొని ఇవ్వడం తప్ప కార్పొరేషన్ నుండి ఇవ్వలేదని తెలిపారు. ఇది పూర్తిగా బాధ్యతారహితమని వెంటనే చనిపోయిన కార్మికులందరికీ నిబంధనల మేరకు అంత్యక్రియలు ఖర్చులు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నిజామాబాద్ కార్యదర్శి కే భూపతి పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉపాధి పనుల వద్ద మాజీ ఎమ్మెల్యే ప్రచారం

నవతెలంగాణ-సదాశివనగర్

ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ మండలంలోని కల్వరాల్ చెరువులో ఉపాధి కూలీల వద్ద ప్రచారం నిర్వహించారు. గాలి అనిల్ కుమార్‌ను గెలిపించాలని కోరారు.

బీఆర్ఎస్ ప్రచారం


ప్రచారం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-వర్ని

మండలంలోని సత్యనారాయణపురం గ్రామపంచాయతీలోని శ్రీనివాస కాలనీలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు ఓటేసి తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకుందామని అన్నారు. కార్యక్రమంలో హైమద్, గప్పర్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్‌కు మద్దతుగా ప్రచారం


ప్రచారం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని జువ్వాడి గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి గాలి అనిల్ కుమార్ మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో భాగంగా గ్రామ అధ్యక్షులు గుర్రం శ్యామ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో మనవాణి వినిపిద్దాం

బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపిద్దాం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

జిల్లా అన్నిరంగాల్లో అభివృద్ధి చేందలంటే మన వాణి పార్లమెంట్‌లో వినిపించాలంటే బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ వీ. గంగాధర్ గౌడ్ అన్నారు. గురువారం మండలం లోని ఘనపూర్ గ్రామంలో ఎంపి అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని, ప్రజల పక్షాన పోరాడే పార్టీ ఒక్క బీఆర్ఎస్ మాత్రమేనని అన్నారు. తెలంగాణ వాదం ఢిల్లీలో వినిపియ్యాలంటే బాజిరెడ్డి గోవర్ధన్‌కు భారీ మెజారిటీతో గెలిపించాలని కూలీలకు కోరారు. కార్యక్రమంలో జడ్పిటిసి దాసరి లక్ష్మీ నర్సయ్య, సీనియర్ నాయకులు శక్కరికొండ కృష్ణ, నల్లవెల్లి సాయిలు, పద్మారావు, నడిపన్న, సుందర్ సింగ్, ఒడ్డం నర్సయ్య, గుడాల లింగం, కో ఆప్షన్ సభ్యులు షేక్ నయీమ్, ఫైజల్ పాషా, మెహమ్మద్ యూసుఫ్, రంజిత్, యేన్నోళ్ల రాజు, సురేష్, గడ్డం గంగాధర్, అంజయ్య, గోపీచంద్, శివ, దాసు, గంగి సాయిలు, ప్రమోద్, బండి సాయిలు, మల్లయ్య కార్యాకర్తలు పాల్గొన్నారు.

ధర్పల్లి: కారు గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో బాజిరెడ్డి గోవర్ధన్ ను గెలిపించాలని ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి ఉపాధి హామీ కూలీలకు కోరారు. మండలంలోని మద్దుల్ తండా పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులవద్దకు వెళ్లి ముందుగా కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కూలీలకు సరిపడా వేతనం కల్పించి, పనిదినాలు పెంచి ప్రజలను ఆదుకునే దిశగా కేసీఆర్ చర్యలు తీసుకున్నారని తెలిపారు. రైతు బిడ్డగా రాష్ట్ర ప్రజల సమస్యలు తెలిసిన మన రూరల్ బిడ్డ బాజిరెడ్డి గోవర్ధన్ ను పార్లమెంటుకు పంపి మన సమస్యలు పరిష్కరించుకుందామని అన్నారు. కారు గుర్తుకు ఓటేసి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజ్పాల్ రెడ్డి, అబ్దుల్ మజీద్, మెగావత్ రమేష్, నజీర్, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నిజామాబాద్ లోక్‌సభ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ కు మద్దతుగా ఇంటింటి ప్రచారాన్ని జోరుగా నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లో బూత్ ల వారిగా స్థానిక నాయకులు టీంలను ఏర్పాటు చేసుకొని ఉదయం, సాయంత్రం ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, అమలు చేయకుండా సమయం పొడిగిస్తూ దాటవేస్తున్న తీరును ప్రజలకు వివరిస్తున్నారు. ప్రజల పక్షాన సమస్యల పరిష్కారం కోసం కొట్లాడే బాజిరెడ్డి గోవర్ధన్ ఎంపిక గెలిపించి పార్లమెంట్ కు పంపించాలని ఓటర్లకు విన్నవించారు. బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాలు ప్రత్యేక బృందంగా ఏర్పడి మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్ధ పాలనను, వంద రోజుల్లో అమలు చేస్తామని మహిళలకు ఇచ్చిన హామీలను ఐదు నెలలు గడుస్తున్నా అమలు చేయకుండా ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య, దాటవేత ధోరణిని మహిళా ఓటర్లకు వివరిస్తున్నారు.


మాట్లాడుతున్న గంగాధర్‌గౌడ్

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని సున్నపురాల తండాలో బుధవారం కురిసిన భారీ వర్షానికి, ఈదురు గాలులకు పైకప్పు రేకులు లేచిపోవడంతో అన్నారం కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి సల్మాన్ ఇండ్లను సందర్శించారు. బాధిత కుటుంబాలైన పి సీతారాం, పంతులు, శివరాం, బట్టు రవికుమార్, బట్టు జమున, తదితరులకు రూ.వెయ్యి చొప్పున బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ స్వామి గౌడ్, కాంగ్రెస్ నాయకులు దయానంద్, షాదుల్లా, పరశురాం యాదవ్, కూడెల్లి ఎల్లం, పంగ రాజ్యం, శివరాజు, బాబా గౌడ్, సత్యం, మైసా గౌడ్, గంగారెడ్డి, దేవదాసు, రవి నాయక్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

నేడు బస్వాపూర్ బసవన్న జయంతి వేడుకలు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని బస్వాపురం బసవన్న జయంతి వేడుకలను శుక్రవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో సప్తహ ముగింపుతో పాటు బసవన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నామని గ్రామస్తులు, గ్రామ పెద్దలు రవి పటేల్ తెలిపారు. హరి భజనతో పాటు శివ భజనలు, కీర్తనలు, ప్రవచనాలు నిర్వహించనున్నారు. అలాగే మహా అన్నదానం చేపట్టనున్నట్లు తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కూనేపల్లి, కళ్యాపూర్ గ్రామ శివారులో ఇసుక టిప్పర్‌ను పట్టుకొని తదుపరి చర్యల కోసం తహసీల్దారుకు అప్పగించినట్లు ఎస్సై ఈ సాయన్న తెలిపారు. కందకుర్తి గ్రామం నుంచి ఇసుక టిప్పర్ ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా వెళ్తున్నట్లు సమాచారం అందడంతో ఈనెల 8న తెల్లవారుజామున పెట్రోలింగ్ చేస్తూ ఉండగా పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆర్ఎస్ఎస్, బిజెపిని ఓడించండి

- ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించండి
- సిపిఐ ఎంఎల్ న్యూడేమోక్రసి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

దేశవనరులను కార్పొరేట్ శక్తులకు అప్పచెప్పి ప్రజలను రోడ్డు మీద నిలబెట్టి ప్రజల మధ్య మత చిచ్చు పెట్టె అర్ ఎస్ ఎస్, బిజెపి మతోన్మాద పార్టీని చిత్తు చిత్తుగా ఈ ఎన్నికల్లో ఓడించాలని, ఇండియా కూటమి అభ్యర్థి జీవన్ రెడ్డిని గెలిపించాలని సిపిఐ (ఎంఎల్)న్యూడేమోక్రసి జిల్లా నాయకులు వేల్పూర్ భూమయ్య ప్రజలను కోరారు.గురువారం డిచ్ పల్లి మండలంలోని దుస్గం గ్రామంలో ఉపాధి కూలి పని క్షేత్రంలో సిపిఐ ఎంఎల్ న్యూడేమోక్రసి ఆధ్వర్యంలో కులిలతో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకన్ని నిర్వీర్యం చేస్తున్నారని, కనీస వేతన చట్టం ప్రకారం కూలి లభించడం లేదని అన్నారు. మోడీ పంటభూములను ఆదాని, అంబానీలకు కట్టబెడుతున్నారని వారన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి ఉపాధిని దెబ్బతీశారని అన్నారు. ప్రజలమీద రాముని పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయం చేస్తున్న ఆర్ఎస్ఎస్ బిజెపి లను చిత్తు చిత్తుగా ఓడించి, ఇండియా కూటమి అభ్యర్థి జీవన్ రెడ్డికీ ఓట్లేసి గెలిపించాలని అయన అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి జెపి గంగాధర్, పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు వాసరి సాయినాథ్, పిఓడబ్ల్యు నాయకురాలు మొద్దు భారతి, దేవస్వామి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు వేల్పూర్ భూమయ్య

మద్యం దుకాణం సీజ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలో స్టేట్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ తుల శ్రీధర్ ఆధ్వర్యంలో పరమేశ్వరి వైన్స్, నిఖిల్ సాయి ఇంటర్నేషనల్ ముందు గల వైన్స్‌లో సోదాలు చేయగా.. కల్తీ మద్యం పట్టుబడింది. హయ్యర్ బ్రాండ్ మద్యం సీసాలలో చీప్ (నాణ్యత లెని)లిక్కర్ కలుపుతున్నారనే సమాచారంతో వైన్స్ దుకాణంపై దాడి చేసి 37 ఫుల్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని, మద్యం దుకాణాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. దాడులు చేసే సమయంలో నిజామాబాద్ ఎస్‌హెచ్ఓ, సీఐ బి.దిలిప్, ఎస్ఐలు మల్లేష్, సుష్మిత, సింధు, సిబ్బంది ధరిసింగ్, మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



మద్యం పట్టుకున్న పోలీసులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి

శుక్రవారం | మే 10, 2024 | www.navatelangana.com

37 సెల్ ఫోన్లు అప్పగింత

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను తిరిగి అప్పగించారు. వన్ టౌన్ ఎస్‌హెచ్ఓ విజయ్ బాబు వివరాల ప్రకారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న దాదాపు 7 లక్షల విలువచేసే 37 సెల్ ఫోన్లను సిఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆచూకీ కనిపెట్టి వాటిని తీసుకువచ్చి బాధితులకు అప్ప జెప్పారు. ఈ సందర్భంగా బాధితులు పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



బంగారం ధర ధగధగ

- నేడు అక్షయ తృతీయ

నవతెలంగాణ-ఆర్మూర్

బంగారం ధరలు ఆకాశన్నంటాయి. రోజురోజుకు కొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. గురువారం 71వేల పలికింది. ఇటీవల జరిగిన శుభకార్యాలు పెళ్లిళ్లకు బంగారం కొనుగోలు చేయడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెళ్లి కానుకగా బంగారం ఇవ్వడానికి ఒప్పుకున్న వారు పెరిగిన ధరలతో ఇబ్బందులు పడ్డారు. జూన్ జూలై నెలలో శుభమూర్తాలు లేకపోవడంతో బంగారు అమ్మకాలు, ఆభరణాల తయారీ అంతంత మాత్రంగానే ఉండనుంది. ధరల ప్రభావం కొనుగోలుపై పడుతుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ధర అడ్డగోలుగా పెరుగుతుండడంతో వ్యాపారులు కూడా బంగారం అమ్మకాల విషయంలో ఆచితూచి అడుగులేస్తున్నారు. ధరలు ఇలానే పెరిగితే సామాన్యులు వెండి, బంగారం కొనడం కలగానే మిగిలిపోతుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

నేడు అక్షయ తృతీయ...

భారతీయ పండుగలలో అక్షయ తృతీయ పర్వదినానికి ప్రత్యేక స్థానం ఉంది. ఈరోజు లక్ష్మీదేవిని బంగారంతో అలంకరించి పూజిస్తే ఇల్లు సిరిసంపదలతో కలకలలాడుతుందని, ఈరోజు ఏ వ్రతం చేసిన ఏ పూజ చేసినా అక్షయం అవుతుందని ప్రజల నమ్మకం.



ఆభరణాల తయారీదారుల్లో ఆందోళన..

బంగారం ధరలు రోజురోజుకు అడ్డగోలుగా పెరుగుతుండడంతో ఆభరణాలు తయారు చేసే స్వర్ణకారులు ఆందోళన చెందుతున్నారు.. పెరిగిన ధరలతో పనులు తగ్గుతాయని బాధ ఒకవైపు ఉండగా,, మరోవైపు ఇప్పటికే ఆర్డర్లు తీసుకున్న వాటికి బంగారం కొనుగోలు చేయడం సమస్యగా మారనుంది. ఆభరణాల తయారీ కోసం డబ్బులు ఇచ్చినవాళ్లు అప్పటి ధరలే ఇస్తామని చెబుతుండడంతో బంగారం కొనుగోలు చేయడానికి చేతి నుంచి డబ్బులు భరించాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వర్ణకార వృత్తిలో పెరిగిన పోటీ మూలంగా గిరాకీ దెబ్బతినకుండా చూసుకోవాలన్న ఉద్దేశంతో నష్టాన్ని కూడా భరించేవాళ్లు కొందరైతే, నష్టపోయి బతకడం భారమని మరికొందరు గిరాకీని వదులుకుంటున్నారు. ఇంకొందరు ధరల పెరుగుదల నేపథ్యంలో ఆభరణాలు చేయించుకునేవారు తమకు సహకరించాలంటూ సోషల్ మీడియా ద్వారా తెలుపుతున్నారు.

కుల వృత్తుల సంక్షేమానికై కృషి చేయాలి



రెడీమేడ్ అమ్మకాల పెరిగిపోతున్న నేపథ్యంలో కుల వృత్తుల పనులు అంతరించిపోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వమైన పార్లమెంట్ ఎన్నికల తర్వాత అయినా కుల వృత్తుల సంక్షేమానికి కృషి చేయాలి

నూనె రాజు, స్వర్ణకార సంఘం నాయకులు
-ఆర్మూర్..

నాణ్యమైన ఆభరణాలను అందిస్తున్నాం...



పెళ్లిళ్లకు ఇతర శుభకార్యాలకు మా యొక్క జ్యువెలర్స్ ద్వారా నాణ్యమైనవి సరసమైన ధరలతో ప్రజలకు ఆభరణాలను అందిస్తున్నాం.

సంతాని గణేష్, రేణుక జ్యువెలరి, ఆర్మూర్

భారత రాజ్యాంగంలో న్యాయవాదుల పాత్ర ఎంతో ఉంది

- పార్లమెంట్ లీగల్ సెల్ కోఆర్డినేటర్ జగదీష్

నవతెలంగాణ-ఆర్మూర్

భారత రాజ్యాంగంలో న్యాయవాదుల పాత్ర ఎంతో ఉందని పార్లమెంట్ లీగల్ సెల్ కోఆర్డినేటర్ జగదీష్ ,లీగల్ సెల్ మెంబర్ ఏలేటి గంగాధర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు తెడ్డు నరసయ్య అన్నారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్ రెడ్డిని గెలిపించుకోవడం ఎంతో అవసరమని అన్నారు. బిజెపి ప్రభుత్వం కులాలు, మతాల పేరుపై రాజకీయం చేసుకుంటూ ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తుందని, పార్లమెంట్ ఉభయసభల్లో 40శాతం మేధావులు, న్యాయవాదులు ఉన్న పార్లమెంటును బిజెపి ప్రభుత్వం నాలుగు శాతానికి తీసుకువచ్చి చట్టాలపై కనీసం అవగాహన లేని వ్యక్తులను పార్లమెంట్లో చట్టసభలకు తీసుకుంటుందని తెలిపారు. 40 సంవత్సరాల సుదీర్ఘకాలం అనుభవం ఉన్న జీవన్ రెడ్డి ప్రజలకు సేవ చేస్తారని, ఆయన్ను అధిక మెజారిటీతో గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ అరుణ్ కుమార్, మాజీ అధ్యక్షులు చిలుక కిష్టయ్య, ఏరుగట్ల గణేష్, సురేష్, మధు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

మనోహర్ దంపతులకు సన్మానం



మనోహర్ దంపతులను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-ముప్కాల్

గుండు మనోహర్ సావెల్ గ్రామస్తులు శాశ్వత చందాదారులుగా ముప్కాల్ మర్రిచెట్టు దేవస్థానం అభివృద్ధికై తోడ్పాటును అందిస్తున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు కనుగంటి లింగం తెలిపారు. ఈ సందర్భంలో గురువారం మర్రిచెట్టు దేవస్థానంకు లక్ష రూపాయలను అందజేశారు. అదేవిధంగా భక్తులకు రూ.10 వేల రూపాయలతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గుండు మనోహర్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గుండు మనోహర్ కుటుంబ సభ్యులతో పాటు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు కనుగుంట లింగం, సెక్రటరీ గడ్డం పెద్ద గంగారెడ్డి, కోశాధికారి నరేష్ యాదవ్, గద్దల గంగారాం, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్‌పల్లిలో ప్రచారం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలో గురువారం బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని జడ్పిటిసి కమల నరేష్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, పరిపాలన చేతకాక కేసీఆర్‌పై అభాండాలు వేస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని, ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చడం లేదని అన్నారు. బాజిరెడ్డి గోవర్ధన్ ప్రజల మనిషిని నిరంతరం ప్రజల శ్రేయస్సు గురించి ఆలోచించే ప్రజా నాయకుడని, ఆయన పది సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రూరల్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బాజిరెడ్డి గోవర్ధన్‌ను అత్యధిక మెజార్టీతో మనం గెలిపించి బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని ఆయన తెలిపారు. బిజెపి కుల రాజకీయాలు చేస్తుందని ప్రశ్నించే వారిపైన ఈడి ప్రయోగిస్తుందని అతి త్వరలో బిజెపి గద్దె దిగుతుందని, ప్రాంతీయ పార్టీలదే పెత్తనమని కేంద్రంలో బీఆర్ఎస్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో న్యాల్కల్ శ్రీనివాసరావు, ఉమాపతిరావు, మోచ్చ శ్రీనివాస్, కంజర భూమయ్య సాయి రెడ్డి తదితర బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అందరికీ సమన్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం

నవతెలంగాణ-మోపాల్

అందరికీ సమన్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి అన్నారు. మండలంలోని న్యాల్కల్ గ్రామంలో గడప గడప కు కాంగ్రెస్ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఇందిరమ్మ మనుమడు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఇప్పటికే ఆరు గ్యారెంటీల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందిస్తునమన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇళు లేని వారికి ఇంటి స్థలం, నిర్మాణానికి రూ.5 లక్షల సాయం, ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం, ఆరోగ్య శ్రీ రూ.10 లక్షల రూపాయలకు పెంచడం జరిగిందని తెలిపారు. గృహజ్యోతి కింద ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నమాన్నారు. రైతు భరోసా ద్వారా రైతులు, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేల సాయం వరి పంటకు ప్రతి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తారని తెలిపారు. యువ వికాసం కింద విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తారని అన్నారు. కేంద్రంలో మన పార్టీ అధికారంలోకి వస్తుందని తెలంగాణకు నిధుల వరద కొనసాగుతుందని తెలిపారు. ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డిని రాష్ట్రంలో అన్ని పార్లమెంట్ స్థానాల్లోకెల్లా అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు సర్పంచ్ గంగ ప్రసాద్ , కిరణ్ రావు, మాజీ ఉపసర్పంచ్ సతీష్, వైస్ ఎంపీపీ అనిత ప్రతాప్ సింగ్ , మాజీ జెడ్పిటిసి మోహన్ కేతవత్, తిరుపతిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి

వర్షానికి ఇళ్లలోకి చేరిన నీరు

- మురుగునీటితో ఇబ్బందులు పడ్డ ప్రజలు



వర్షంతో కాలనీలో చేరిన నీరు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని జాగిర్యాల్, బడా భీంగల్‌లో సాయంత్రం కురిసిన అకాల వర్షానికి గాంధీ కాలనీ జలమయమైంది. అరగంట సేపు ఏకధాటిగా కురిసిన వర్షానికి పలు ఇళ్లలోకి మురుగునీరు చేరడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే వర్షాకాలంలో పరిస్థితి ఎలా ఉంటుందో అని ఆందోళన చెందుతున్నా కాలనీ వాసులు. అధికారులు స్పందించి వర్షాకాలంలోపు డ్రైనేజీ పనులు చేపట్టి కాలనీలోని ఇళ్లలోకి మురుగునీరు రాకుండా చూడాలని కాలనీవాసులుకోరుతున్నారు.

బాలల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

- బాలల పరిరక్షణ అధికారి చైతన్య కుమార్

నవతెలంగాణ-భీంగల్

బాలల సంరక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాయని బాలల సంరక్షణ అధికారి చైతన్య కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని చేంగల్ గ్రామంలో మహిళా శిశుసంక్షేమశాఖ బాలల పరిరక్షణ విభాగం, బాలరక్ష భవన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్యకుమార్ బాలల చట్టాలపైన బాలల హక్కులపైన అదే విధంగా బాల్యవివాహాలు, భ్రూణ హత్య నిషేధ చట్టంపైన అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాల్య వివాహాలు చేసిన వారికి చట్ట పరమైన శిక్ష గురించి తెలిపారు. భ్రూణ హత్యలు జరగకుండా చూడాల్సిన బాధ్యత గ్రామ ప్రజలలో ఉందని అన్నారు. బాలలపై లైంగిక వేధింపులు నిరోధక చట్టంపైన అవగాహన కల్పించి చుట్టుపక్కల ఉన్న పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. ఎక్కడైనా ఇలాంటి సంఘటన జరిగితే 1098 చైల్డ్ టోల్ ఫ్రీ నెంబర్‌కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ మండల సూపర్వైజర్ రమాదేవి, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది బిగ్ సింగ్, ముజాహిద్, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారి

అభివృద్ధి కోసం ఎంపిగా పోటీచేస్తున్నా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గం లో నిరుద్యోగ యువత సమస్యలను, వ్యవసాయ రైతుల, సమస్యలను పరిష్కరించేందుకే తాను పోటీలో ఉన్నట్లు నిజామా బాద్ పార్లమెంట్ స్వాతంత్ర అభ్యర్థి గంట చరిత రావు అన్నారు. నిజామాబాద్ నగరంలోని ప్రెస్ క్లబ్లో గురువారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా దేశంలో నిరుపేద సమస్య తీర్చడంలో పాలకులు విఫలం అయ్యారని ఆమె అన్నారు. నిజామాబాద్ ను అభివృద్ధి చేయడం లో ఇక్కడి పాలకులు నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. నిరుపేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలనే లక్ష్యంతో పనిచేస్తానని, దినసరి కూలీలకు పనికి తగిన వేతనం, సమయపాలన, ఏమైనా ప్రమాదం జరిగితే ఆసుపత్రిలో వైద్య సదుపాయం, మహిళ విద్యార్థులకు డిగ్రీ కళాశాల, గల్ఫ్ బాధితులకోసం ఇక్కడే ఉద్యోగ అవకాశ కల్పన చిన్న తరగతి ప్రజలకు నివసించేందుకు సరైన గృహాలు లేవని వారికీ పక్కా ఇళ్ళు నిర్మించేలా ప్రణాళిక పనిచేస్తానని అన్నారు. గంజ్‌లో పనిచేస్తున్న కార్మికులకు ఉచిత బీమా సౌకర్యం కలిపిస్తానని, ఇందూర్ జిల్లా ప్రజలు మంచి ఆలోచనతో ఓటు వేసి తనను గెలిపిస్తారని ఆశాభవం వ్యక్తం చేశారు. భారతదేశంలో అన్ని సదుపాయాలు ఉన్నాయని, ఉద్యోగాల కోసం బయట దేశాలకు వెళ్లే రోజులు పోవాలని తన గుర్తు కంప్యూటర్ గుర్తు అని నమూనా బ్యాలెట్లో సీరియల్ నంబర్ 17 అని తెలిపారు.

ఆగస్టు 15 కల్లా రెండులక్షల రుణమాఫీ

- కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ-కోటగిరి

ఆగస్టు 15 కల్లా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తారని కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని నల్లచెరువులో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతుందని, 10 సంవత్సరాలలో తెలంగాణను అప్పుల కుప్పలుగా మార్చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌దని వివరించారు.



ప్రచారంలో మాట్లాడుతున్న ఏనుగు రవీందర్‌రెడ్డి

బీఆర్ఎస్ నాయకుల ఎన్నికల ప్రచారం



నవతెలంగాణ-బోధన్

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ నాయకులు గురువారం సాలూర మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు వెంకట పటేల్ మాట్లాడుతూ కారు గుర్తుకి ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎల్మా దత్తు, రత్నెల్లి లింగయ్య లాలయ్య, లక్ష్మయ్య, సాయిలు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

నవతెలంగాణ-ఏర్గట్ల

ఉప్లూర్ గ్రామానికి చెందిన డాకూరి చక్రవర్తి రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈయన గతంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్గట్ల బ్రాంచ్‌లో ఎస్బిఐ జనరల్ ఇన్సూరెన్స్ తీసుకున్నారు. మరణించిన ఆయనకు ఇన్సూరెన్స్ క్లెయిమ్ కావడంతో ఏర్గట్ల ఎస్బిఐ మేనేజర్ సిహెచ్. రాము చేతుల మీదుగా నామిని అయిన డాకూరి లతకు 20 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ రాము మాట్లాడుతూ... ప్రభుత్వ పథకాలను అర్హులు ఉపయోగించుకోవాలని, బాధిత కుటుంబానికి ఎస్బిఐ అండగా నిలవడం ఆనందగా ఉందని అన్నారు. ఇందులో భాగంగా సర్వీస్ మేనేజర్ ఎం.ధర్మపురి, ఏరియా బీడీఎం శ్రీధర్, బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.



చెక్కు అంజేస్తున్న దృశ్యం

నిమామాబాద్ రైల్వే అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తా

- ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి



రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజమాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. నిజామాబాద్ రైల్వే స్టేషన్‌ను గురువారం సాయంత్రం ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, కేశ వేణుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి కి నోచుకోలేదని, కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతోందని, ఎంపీగా గెలుపొందిన తర్వాత నిజామాబాద్ రైల్వే స్టేషన్ ను అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. నిజామాబాద్ రైల్వే స్టేషన్ లైన్ డబ్లింగ్ చేస్తే ప్రయాణికులకు సౌకర్యాలు ఏర్పడతాయని, నిజామాబాద్ రైల్వే జంక్షన్ అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఆర్మూర్ నుండి అదిలాబాద్, బోధన్ నుండి బీదర్ వరకు రైల్వే లైన్ ఏర్పాటు చేస్తానని అన్నారు.

బీఆర్ఎస్ ప్రచారం ముమ్మరం

నవతెలంగాణ-మద్నూర్

బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాలి అనిల్ కుమార్ గెలుపు కోసం మద్నూర్ మండల కేంద్రంలో గురువారం ఇంటింటా ప్రచారాన్ని నిర్వహిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కంచిన్ హనుమాన్లు, తూము హనుమాన్లు, దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.